

సప్తగిరికాలనీలోని తన నివాసంలో చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ముఖ్యనాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

పదేళ్ల అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. సప్తగిరికాలనీలోని తన నివాసంలో శనివారం చేవెళ్ల బీఆర్ఎస్‌అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలంటూ అభ్యర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హమీద్‌పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాసరావు, నాయకులు సాయిబాబా, మోహన్‌గౌడ్, రవీందర్‌ముదిరాజ్, గణేష్, సంజీవరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాజుయాదవ్, గౌతమ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీబీ

ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండకు చెందిన ఎస్‌కే బీబీ శనివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. గతంలో బీఆర్ఎస్ నాయకురాలిగా ఉన్న ఆమె ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. కొద్దిరోజులకే తిరిగి సొంతగూటికి వచ్చారు. ఆమెకు సప్తగిరికాలనీలోని తన నివాసంలో ఎమ్మెల్యే గాంధీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్‌రావు, కాశీనాథ్‌యాదవ్, చిన్నోళ్ల శ్రీనివాస్, కిషన్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

హైదర్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వీరహనుమాన్ ఉత్సవ కమిటీ చైర్మన్ విజిత్‌వర్మ ఆధ్వర్యంలో శనివారం ఈనెల 23న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శోభయాత్ర, వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. మధ్యాహ్నం 1గంటకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామరాజు, నర్సింగ్‌యాదవ్, కమలాకర్, నరసింహచారి, భూపాల్‌రెడ్డి, నర్సింగ్, రఘు, సంతోష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో శోభాయాత్ర..

కూకట్‌పల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న శోభాయాత్ర పోస్టర్‌ను శనివారం మూసాపేటలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. రామదండు ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయయాత్ర పేరుతో మూసాపేటలో చేపట్టబోయే ఈ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జిల్లా గోపాల్, పాండుగౌడ్, కర్క పెంటయ్య, తూము వినయ్, కొడిచెర్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్ పోస్టర్..

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ఐదోఫేజ్‌లోని కృష్ణ సింధూరి సంకల్ప లలిత కళానిలయంలో సమ్మర్ క్యాంప్ గోడపత్రికను శనివారం ప్రిన్సిపాల్ గుమ్మడి జనార్దన్, సెక్రటరీ చిగిచెర్ల కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 25 నుంచి నెలరోజుల పాటు విద్యార్థులకు సంగీతం, చిత్రలేఖనం, కీబోర్డు, వెస్ట్రన్ డ్యాన్స్‌లో శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 040-23053266లో సంప్రదించవచ్చన్నారు.



సిరామిక్ టైల్స్ డిజైన్‌ల ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ప్రిజం జాన్సన్ లిమిటెడ్ ఎండీ విజయ్ అగర్వాల్ సీఈఓ శరత్‌చందక్, అజయ్ మిశ్రాత తదితరులు

జాన్సన్ సెరామిక్‌లో 3 వేల డిజైన్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): టైలింగ్ రంగంలో సమస్యలను పరిష్కరించడంతోపాటు జీవనశైలి మెరుగుపరచడం, పరిశుభ్రత, పర్యావరణ హితానికి పెద్దపీట వేస్తామని ప్రిజం జాన్సన్ లిమిటెడ్ ఎండీ విజయ్‌అగర్వాల్ అన్నారు. హైటెక్స్‌లోని నోవాటెల్ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 3 వేలకుపైగా కొత్త టైల్స్ డిజైన్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నామని, హెచ్‌అండ్‌ఆర్ జాన్సన్ (ఇండియా) ఆధ్వర్యంలో బిల్డింగ్ మెటీరియల్స్‌ను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తామని చెప్పారు. సంస్థ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ శరత్‌చందక్, హెచ్ అండ్‌ఆర్ అధ్యక్షుడు అజయ్‌మిశ్రా మాట్లాడుతూ అగ్రశ్రేణి బిల్డింగ్ మెటీరియల్స్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.

ఫ్యాటీ లివర్ క్లినిక్‌లో ఉచిత వైద్యం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాలేయ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతునన రోగులకు ఆధునాతన రోగనిర్ధారణ చేయడానికి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆస్పత్రిలో ఫ్యాటీ లివర్ క్లినిక్‌ను అందుబాటులోకి తెచ్చామని, దీని ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి క్లినికల్, ట్రాన్స్‌ప్లాంట్ హెపటాలజిస్టు డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అవసరమైన వారికి నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అత్యాధునిక చికిత్సలను అందిస్తామన్నారు. ఫైబ్రోస్కాన్ అనే ఇన్వాసివ్ డయాగ్నోస్టిక్ పరికరం ద్వారా ఇలాంటి ఇబ్బందులు, నొప్పి కలగకుండా కాలేయం, ఆరోగ్యాన్ని అంచనా వేసి కీలక సమాచారం అందిస్తుందన్నారు. వరల్డ్ లివర్‌డే సందర్భంగా ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చాని, మొదట వచ్చిన కొంత మందికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు.

నేడు మాంసం విక్రయాలు బంద్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మహావీర్ జయంతి సందర్భంగా గ్రేటర్‌లో ఆదివారం మటన్, చికెన్, ఫిష్, బీఫ్ షాప్‌లు మూసివేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. జీహెచ్ఎంసీ ఆదేశాలు, నిబంధనలను దుకాణ నిర్వాహకులు పాటించాలన్నారు.

కూకట్‌పల్లిలో రూ.54లక్షల నగదు స్వాధీనం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా నగదు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులతోపాటు ఇటాచీ కంపెనీకి చెందిన వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.54లక్షల నగదు స్వాధీనం చేసుకొన్నారు. ఎస్సై ప్రేమ్‌సాగర్ తెలిపిన వివరాల ప్రకారం... కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌లో నివాసముండే మహ్మద్‌ఖలీల్(21), పి.నగేష్(22) ఏటీఎంలో నగదు పెట్టే ఇటాచీ క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరిద్దరూ శనివారం కంపెనీకి చెందిన వాహనం(టీఎస్09యూడీ3757)లో రూ.54.52లక్షల నగదును తరలిస్తుండగా... కూకట్‌పల్లి జాతీయరహదారి భాగ్యనగర్‌కాలనీ వద్ద బాలానగర్ ఎస్‌వోటీ, కూకట్‌పల్లి పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. సదరు నగదుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో డబ్బుసీజ్ చేశారు. నగదును ఎన్నికల కమిషన్ అధికారులు అప్పగించామని ఎస్సై తెలిపారు.

వైద్యం కోసం ఆస్పత్రిలో చేరిన వ్యక్తి అదృశ్యం

దుండిగల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్న ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 4న బాచుపల్లి మమతా ఆస్పత్రి సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని బాచుపల్లిలో నిర్వహించారు. అదేగ్రామానికి చెందిన బి.సిద్ధిరాములు, (52) భార్య సంధ్య, మరో పది మందితో కలిసి వైద్య శిబిరానికి హాజరయ్యారు. అయితే ఆస్పత్రి సిబ్బంది సిద్ధి రాములుని పరీక్షించి, అతనికి ఎడమ భుజం ఫ్యాక్చర్, కుడికాలు వాపుందని, జనరల్ వార్డులో చేర్పమని భార్య సంధ్యకు తెలిపారు. అయితే భార్య భర్తను ఆస్పత్రిలో చేర్పించింది. ఈనెల 6న మధ్యాహ్నం 1 గంటకి భార్య భర్తకు ఫోన్ చేయగా మచం మీదనే ఉన్నానని చెప్పాడు. అదే సాయంత్రం ఎన్ని సార్లు భర్తకు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఈనెల 7న సంధ్య ఆస్పత్రికి వచ్చి చూసి, సిబ్బందిని అడుగగా 6వ తేదీనే ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. శనివారం కూడా భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25 రోజులు కష్టపడి గెలిపిస్తే.. 5 ఏళ్లు మీకు సేవ చేస్తా

మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునితారెడ్డి

బాలానగర్/ఫతేనగర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): 25 రోజులు తన కోసం పనిచేసి, ఎంపీగా గెలిపిస్తే 5 ఏళ్లపాటు మీకు సేవకురాలిగా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బాలానగర్, ఫతేనగర్ డివిజన్‌లలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌తో కలిసి ఆమె మాట్లాడారు. కార్యకర్తలు భేషజాలు పక్కన పెట్టి కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం 32 వేల దరఖాస్తులు వస్తే ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలేదని ఆరోపించారు. బాలానగర్ డివిజన్‌లోని దిల్‌కుష్‌నగర్ రోడ్డు సమస్యను దగ్గరుండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఓల్డుబోయిపల్లి డివిజన్ మైనారిటీల కోసం కమ్యూనిటీహాల్‌ను నిర్మించి మైనారిటీలకు అండగా నిలుస్తామని అన్నారు. సునీతా మహేందర్‌రెడ్డి విజయాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలలో 3 స్థానాలను మహిళలకు కేటాయించింది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అన్నారు. మొట్టమొదటి సారిగా మల్కాజిగిరి మహిళల అభ్యున్నతి కోసం మల్కాజిగిరి పార్లమెంట్ టికెట్ పట్నం సునీత మహేందర్‌రెడ్డికి ఇచ్చారని ఆమెను గెలిపించుకోవాల్సిన బాధ్యత మహిళలపై ఉందని కోరారు. ఏ బ్లాక్ అధ్యక్షుడు పటోళ్ల నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఐడీపీఎల్, బీహెచ్ఈఎల్, హెచ్ఏఎల్ లాంటి కంపెనీలను తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే కార్మికలోకానికి న్యాయం జరుగుతుందని, అందుకే హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పుష్పారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలతో కళకళలాడుతోందన్నారు. బాలానగర్, ఓల్డుబోయినపల్లి డివిజన్ అధ్యక్షులు మధూగౌడ్, మల్లికార్జున్‌యాదవ్, భరత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు దండుగుల యాదగిరి, శేరిసతీష్‌రెడ్డి, మాజీ వైస్‌చైర్మెన్ లక్ష్మయ్య, శ్రీకాంత్ పటేల్‌గౌడ్, ఎడ్లమోహన్‌రెడ్డి, నియోజకవర్గ, డివిజన్‌ల నాయకులు పాల్గొన్నారు.



బాలానగర్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి పట్నం సునితామహేందర్‌రెడ్డి

జోరుగా కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డిని గెలిపించాలని శనివారం అమర్ సొసైటీలో, కొండాపూర్ డివిజన్ రాఘవేంద్రనగర్‌కాలనీలో, ఆల్విన్‌కాలనీలో, హఫీజ్‌పేట డివిజన్ జనప్రియ అపార్ట్‌మెంట్‌లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, పూజిత కాంగ్రెస్‌కు ఓట్లేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.



రాఘవేంద్రకాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి

గచ్చిబౌలి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధిపొందుతున్నారని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా శనివారం కొండాపూర్ డివిజన్ రాఘవేంద్రనగర్‌కాలనీలో శేరిలింగంపల్లి అబ్జర్వర్, టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి తనయుడుతో కలిసి జగదీశ్వర్‌గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు టి.కృష్ణ, రఘునాథ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, పక్కన శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

సమస్యలను పరిష్కరిస్తాం

గచ్చిబౌలి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అన్నికాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం కొండాపూర్ డివిజన్‌లోని అమర్ సొసైటీలో పలు కాలనీవాసులతో అల్పాహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే, ప్రజాసేవచేసే నాయకుడిని ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేట్ శక్తుల కోసమే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అన్ని వర్గాలు, రాష్ట్ర, దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీలో

హైదర్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి కాంగ్రెస్‌కు ఓట్లు వేసి రంజిత్‌రెడ్డని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, కృష్ణముదిరాజ్, మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా టిఫిన్‌సెంటర్‌లో బజ్జీలు వేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

జనప్రియ అపార్ట్‌మెంట్‌లో...

మియాపూర్,: హఫీజ్‌పేట డివిజన్ జనప్రియ అపార్ట్‌మెంట్‌లో హఫీజ్‌పేట కార్పొరేటర్ పూజిత చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నేరవేరుస్తుందని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.



జనప్రియనగర్‌లో రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ పూజిత

హెచ్‌సీఏ వేసవి శిక్షణ కేంద్రాలు ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) ఏర్పాటు చేసిన 29 వేసవి శిక్షణ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. శనివారం మాదాపూర్, లాలాపేట సమ్మర్ క్యాంప్‌లను హెచ్‌సీఏ అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్‌రావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాల తర్వాత తొలిసారిగా సుమారు రూ.1.50 కోట్లు ఖర్చు చేసి, వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ శిబిరాల్లో ప్రతిభావంతులను గుర్తించి, వారికి హెచ్‌సీఏ లీగ్స్‌లో ఆడే అవకాశం కల్పించడంతో వారికి ప్రత్యేకంగా సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నామన్నారు. త్వరలో హెచ్‌సీఏ లీగ్స్, ఇతర టోర్నమెంట్ల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దేవ్‌రాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెటర్లతో జగన్‌మోహన్‌రావు తదితరులు

వేసవిలో కుక్కలకు నీటితొట్ల ఏర్పాటుపై అవగాహన

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో కుక్కలకు నీటితొట్ల ఏర్పాట్లపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ నేతృత్వంలో కేపీహెచ్‌బీ బస్టాప్, మెయిన్ రోడ్డులో శనివారం ర్యాలీ నిర్వహించారు. వేసవిలో కుక్కకాట్ల నివారణ చర్యల్లో భాగంగా వీధికుక్కలు తాగేందుకు నీటిని ఏర్పాటు చేసే నియమావళిని జోన్‌లోని ఐదు కమిషనర్ల వైద్యాధికారులు, మూసాపేట్, కూకట్‌పల్లి సర్కిళ్ల ఉపకమిషనర్లు, ఉప సంచాలకులు, వెట్రినరీ, శానిటరీ సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ.. జోన్ పరిధిలోని అన్ని వ్యాపార సముదాయాలు, ఫుట్‌పాత్, టీస్టాల్, జీవీపీ పాయింట్‌లలో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా వీధికుక్కకాటు నివారణకు పాటించాల్సిన నియమావళిని వేసవిలో తాగునీటి నిరంతర లభ్యతకు తొట్ల ఏర్పాటు అంశాలను వివరించారు. అలా ఏర్పాటు చేసిన తొట్లలో శుభ్రమైన నీటిని అందుబాటులో ఉంచేందుకు శానిటేషన్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం ప్రజల సహకారం, జంతుప్రేమికులు, ఎన్జీఓల సహకారంతో వీధికుక్కల దాహార్తి తీర్చి, తద్వారా అవి వెర్రెక్కకుండా చూడాలన్నారు.



తొట్లలో జడ్సీ అభిలాష అభినవ్ సంమక్షంలో నీటిని నింపుతున్న అధికారి

రాంగ్‌రూట్‌లో నడపొద్దు.. ఇబ్బందులు పడొద్దు

- మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేసి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దు...మీరూ ఇబ్బందులు పడొద్దని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్ ట్రాఫిక్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ నాగేశ్వరరావు సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మేడ్చల్ ట్రాఫిక్ డివిజన్‌లోని వాహనదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేసిన వారిపై కేసులు నమోదయ్యాయన్నారు. ఓవర్‌స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సిగ్నల్ జంప్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసి ఇతరుల మరణాలకు కారణమవుతున్న వారిపై ఐపీసీ 304సెక్షన్ క్రింద కేసులు నమోదు చెయ్యడం జరుగుతుందన్నారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపవద్దని, ఒకవేళ నడిపితే వారిపై ట్రాఫిక్ పోలీసులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, ఐపీసీ 336 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెంబరుప్లేట్ లేని వాహనాలు నడిపి, పోలీసులకు పట్టుబడితే ఇబ్బందులు పడతారని, అలాగే మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే, వారి తల్లిదండులే కాక, వాహన యజమానిపై చర్యలు తీసుకుంటాం అన్నారు. మద్యం తాగి పోలీసులకు పట్టుబడితే కోర్టులో జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన 15 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల మధ్య ఉన్న వారే పడుతున్నారని, ఫుట్‌పాత్‌లను షాప్స్‌వారు ఆక్రమిస్తే జీహెచ్ఎంసీ యాక్టు ప్రకారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయిస్తాం అన్నారు. పబ్లిక్ రోడ్లపై డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా, బాధ్యతతో తమ వాహనాలను నడిపాలన్నారు. 2024లో మార్చి 31 వరకు 56 ప్రమాదాలు జరుగగా 12 మంది మృతి చెందారని, వాహనదారుల క్రమ శిక్షణతో సురక్షితమైన ప్రయాణం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్ రెడ్డి



నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

హైదర్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల జశ్వంత్‌రావు, భీంరావు, గొట్టిముక్కల తులసీవర్ధన్‌రావు, రామనుజన్‌రెడ్డి, బాబుతో పాటు పలువురు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రేవంత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు..

గాజులరామారం ఏప్రిల్, (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి సమక్షంలో సీఎం కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ ప్రధానకార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మారెడ్డి, జయరాం, మాజీ కో ఆప్షన్‌సభ్యులు సయ్యద్‌రషీద్, సీనియర్ నాయకులు, వల్లెపు కృష్ణగౌడ్, మీర్జా రషీద్‌బేగ్ రవికిరణ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

చందానగర్‌లో..

చందానగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నాడు, నేడు భవిష్యత్‌లో కూడా కాంగ్రెస్‌పార్టీ పనిచేస్తోందని చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి నరేందర్‌రెడ్డి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. వీరి సమక్షంలో రాజీవ్‌గృహకల్పకు చెందిన శర్మ, జయమ్మ ఆధ్వర్యంలో సుమారు 300 మంది కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, నాయకులు రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న నరేందర్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్

కాంగ్రెస్‌లోకి 'ఉరిటి'!

చందానగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ చందానగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉరిటి వెంకట్రావ్ తన అనుచర గణంతో కాంగ్రెస్‌లో చేరనున్నారు. నేడో..రేపో కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. 2007 నుంచి చందానగర్ డివిజన్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఉరిటి, 2016 టీడీపీ నుంచి కార్పొరేటర్‌గా పోటీచేసి స్వల్పమెజార్టీతో ఓడిపోయారు. ఎమ్మెల్యే గాంధీకి ముఖ్య అనుచరుడిగా ఉంటూ ప్రజాసమస్యలపై నిరంతరం కృషిచేస్తున్నాడు. అయితే కాంగ్రెస్ ప్రజాపాలనకు ఆకర్షితుడై పార్టీలో చేరనున్నారు. ఆదివారం చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఇన్‌చారివేం నరేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు.



కాలనీల ప్రజలతో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

ప్రజలకు అందుబాటులో ఉంటా : కూన

గాజులరామారం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలు బస్తీలు, కాలనీల ప్రజలు, సంక్షేమ సంఘ సభ్యులు శ్రీశైలంగౌడ్‌ను కలిసి బస్తీలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పలు సంక్షేమ సంఘాలసభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరెడ్డి సతీమణి ప్రచారం

మియాపూర్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి శనివారం నియోజకవర్గంలోని పలు గేటెడ్ కమ్యూనిటీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంజీరా డైమండ్‌టవర్స్, పాపిరెడ్డికాలనీలో ఆమె పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కేంద్రప్రభుత్వ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. బీజేపీకి ఓట్లు వేసి విశ్వేశ్వరరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

చందానగర్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా ఆ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి కట్ట వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

- టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను శనివారం కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచారు. బాణసంచా కాల్చి జై బాబు జైజై బాబు అంటూ నినదించారు. ఏపీలో కాబోయే సీఎం సీబీఎన్ అంటూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు.

\- కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి)

